రాజమ్మ బయటకు చప్పుడయ్యే కీళ్ళతోలేచి గోడకి చేరబడి కూర్చుంది. బయటికి కనపడనంత లోతుగావున్న తన కళ్ళతో రాంబాబుని తీక్షణంగా చూసి "తప్పకుండా అడిదే బాబూ! అడిదే! అడిపుటకే... అదు పుట్టడవేఁ అడితప్పు" అని చూపు మరల్చి దూరంగా నిశీథంలోకి చూస్తూ "మాలాటోళ్ళని పుట్టిన్చ డవేఁ అడితప్పు" అంది చెయ్యెత్తి ఆకాశం వేపు చూపిస్తూ.

(1968)

తీర్పు

నువ్వు నా దగ్గరికి రాకముందెక్కడికీ వెళ్ళలేదా? గుడ్. మంచిదే! ఏడు మనుముల ఎరకల్దాన్లాంటి వాణ్ని. నాకు బార్లో ముప్ఫై ఏళ్ళు పూర్తయి ఎన్నేళ్ళయ్యాయో చెప్పడానికి నే నిష్ట పడను. కష్టపడి కట్టలుమోస్తే ఎప్పటికైనా మేస్ట్రీ ప్లీడరువవుతావు. తొందర పురోభివృద్ధికి శతృవు. కేస్ 'లా' బాగా చదువు. ఒక లా పాయింటు గురించి ఒక హైకోర్టు ఓలా అంటే, మరోటి మరోలా అంటుంది. పెళ్ళాం పిల్లల్ని కనాలా? వద్దా? అనడిగితే, కనాలని వొక హైకోర్టంటుంది. కనఖ్ఖర లేదని మరోటంటుంది. చేతనైతే మొగుణ్ణే కనమని మూడో దంటుంది.

నా చిన్నప్పుడొకడు బోలెడాస్తి తగలబెట్టేకుండా చచ్చేడు. ఆ ఆస్తి నాదంది వాడి కూతురు. అంటే తనదంది. కాదన్నాడు వాడి తమ్ముడు. ఏం అంటే అది వాడి కూతురుకాదు. కాక పోయినా దానమ్మ దాన్నాన్నని పెళ్ళాడలేదని మొండికెత్తేడు. బ్రతికున్నది చచ్చినవాడి కూతురా? కాదా అన్న పాయింటుమీద ముప్ఫైమంది సాక్షుల్ని విచారించి, ముత్తుస్వామయ్యరు ఆర్గు మెంట్‌విని, కూతురే అంది మొదటికోర్టు. అపీలెల్తే కాదన్నారో హైకోర్టు సింగిల్‌జడ్జీ. మళ్ళీ అపీలెల్తే ఔనన్నారిద్దరు జడ్జీలు.

అలా అని ఊరుకోకుండా దీనమ్మకి మొదట్లో ఇంకెవరి తోనేనా పెళ్ళయిందా లేదా అన్న పాయింటెవరూ చూళ్ళేదని, ఆ పాయింటు విచారించమని కిందికోర్టుకి రిమైండ్ చేశారు. కిందికోర్టు మరో పదిమందిని విచారించి పెళ్ళయిందంది. దాని మీద అపీలెల్తే దానమ్మకి అదివరకు పెళ్ళవలేదనే అన్నారు. మా క్లయింటు గెల్చుకుంది. కాని ఈ లోగా ఉట్టి ముసలిదై పోయింది. మూళ్ళక్ష లాస్తికి మూణ్నాలపరక మిగల్లేదు. దాని మొహం నేను చూడలేక పోయేవాణ్ణి. కాని అది మాత్రం వారా నికో అప్పడాలకట్ట ఇచ్చిపోయేది. ఆఖరికి అప్పడాలమ్ముకొనే బతికిందిలే.

ఇంకే సీనియర్ దగ్గర కెళ్ళినా ఇలాంటి పాతకాలం సలహా లివ్వవచ్చు. నువ్వు పట్టాపుచ్చుకొని పనికి రావాలనుకుంటే ఎలాగా పుస్తకాల పురుగు వవుతావు. కష్టపడతావు. ముందు కొస్తావు. నాకు సందేహం లేదు. ఇవన్నీ తుప్పట్టిన కబుర్లే.

నీకు తెలీంది. నీ కెవ్వరూ చెప్పందీమాత్రం ఒకటుంది. జడ్జీ మనస్తత్వంబట్టి పోవడం నేర్చుకోవాలి. దుర్యోధనుడే ఆయుధం తీస్తాడో ధర్మజుడికి ముందే తెలిసుండొచ్చు.

కాని జడ్జీ ఎప్పుడు ఏ అడ్డు పెడతాడో ముందుగా నీకు తెలీదు. చాలాసార్లు అతగాడికే తెలీదు.

"కాని మీవాడు పెళ్ళాన్నొదిలేశాడు. ఎలా నమ్మ మంటావ్, వాడి సాక్ష్యం?" అని నీకాళ్ళలో కర్రపెడతాడు. నీ కళ్ళల్లో కారం కొడతాడు. అంతవరకూ నీది స్ట్రాంగ్ కేస్ అనుకున్న నువ్వు నెత్తిన గుద్దేసుకోవాల్సిందే. నీ క్లయింటు అనుకున్న ధరకి బంగాళాదుంపలు కొంటానన్నా అవతలివాడు అమ్మకపోవ డానికీ, మీవాడు భార్య నొదిలెయ్యడానికిగల సంబంధం నీకు తెలీదు. అట్టే మాట్లాడితే జడ్జీకే తెలీదు. కాని నువ్వలా అన్లేవు. ఆ సంగతి నీకంటే జడ్జీకి బాగా తెలుసు.

నీ కేసు పోతుంది. నీకు నీరసం వస్తుంది. నవ్వు క్లబ్బు నుంచి ఆలస్యంగా వెళ్ళడానికి, అన్నం చల్లారి పోడానికి సంబం ధం నీకు తెలీదు. నీ పెళ్ళాన్నడుగు తావు. ఆవిడ చెబుతుంది. నిజం చెప్పినందుకు నువ్వు కోంబడతావు. అడిగేవాడికి చెప్పే వాడు లోకువ. నీ పెళ్ళాం నీకు లోకువ. నువ్వు జడ్జికి లోకువ.

ఇలా అంటున్నానని జడ్జీలకి మూడు చేతులూ, ముప్ఫై కాళ్ళూ, కొండజెర్రిలా ఉంటాయనుకోకు. వాళ్ళంతా నీలాంట్నా లాంటివాళ్ళే. చాలామంది నాకంటే మంచివాళ్ళు కూడా.

"వాళ్ళకి చెవులుంటాయేకాని కళ్ళుండవు. బుర్రుంటుంది కాని బుద్ధుండదు. గుండె ఉంటుందికాని దయుండదు" అని అంతా అనేమాటలు నేను అనను.

కాని నే ననేదిమాత్రం ఒకటే. వాళ్ళకి చాలా మామూలు విషయాలు అర్థంకావు. దానిక్కారణం వాళ్ళు కాకపోవచ్చు. పుట్టుకతో వచ్చిన గుణాలు మనం ఏం చేసినాపోవు. కాని, నా

ఏడుపల్లా వీళ్ళు దేవుడిచ్చిన అజ్ఞానం వృద్ధి చేసుకుంటున్నారనే. దెబ్బలాడుకున్నా చాలామంది మొగుడూ పెళ్ళాలు కలిసే వుంటారనీ, పాతబాకీ ఎగ్గొట్టేసినా ఖాతాదారుకి మళ్ళీ అరువిస్తారనీ, ఒక తాగుబోతు మంచి భర్తకావచ్చునీ వగైరా విషయాలు వీళ్ళకి తెలియవు.

జీవితంలో ధక్కామొక్కీలు తినవలసిన టైముకి వీళ్ళు మునసబులూ, మేజిస్ట్రేట్లూ అయి అడపెక్కి కూర్చుంటారు. అక్కణ్ణించి చూస్తే మామూలు మనుషులు పురుగుల్లా కనిపిస్తారు. వెనకటికో జడ్జిగారి మీద అతని విధవాదిన మనోవర్తి డిక్రీ పొందిందట. దాంతో మనోవర్తి మనిషెవరైనా అతగాడి కోర్టుకొస్తే మండిపడి పోయేవాడ. మరో కోర్టువారిని వారి అన్న మోసంచేసేట్ట. దాంతో అతగాడు దావావేసిన ప్రతి తమ్ముణ్ని తోబుట్టువుగా చూచుకునే వాడు.

అంచేత నేను చెప్పేదేమిటంటే నా పార్టీ అదృష్టం ఒక్కొక్కప్పుడు జడ్జీగారి జీవిత విశేషాలమీద ఆధారపడి వుంటుంది. ఉరుమూలూ, పిడుగులూలా సాక్ష్యముంటే ఏ చచ్చు ప్లీడరన్నా గెలుచుకుంటాడు. నీక్లయింటు కేసు నిజమై, కోర్టుకు కావల్సిన అబద్ధ సాక్ష్యం వాడు తేలేనప్పుడే నీకు కష్టం.

చాలాకాలం క్రిందట తను బార్‌లో కాలుపెట్టి నప్పుడు తన సీనియర్ లాయరు తనకిచ్చిన ఆ సలహా ఎందుకో సుదర్శనానికి ఆకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

రాత్రి పదిగంటలు కొట్టి ఎంతసేపైందో వకీలు సుదర్శనానికీ, అతని కెదురుగావున్న కనకరావుకీ తెలీదు.

కనకరావు పెద్దలిచ్చిన ఆస్తికి పెద్దపెట్టున బిజినెస్ కలిపేడు. పెద్దలు కుదిర్చిన పెళ్ళానికి అన్ అఫీషియల్‌గా తోడు తెచ్చుకున్నాడు. అతను ఎలక్షన్‌కి నిలబడితే ఓట్లు టపటప రాల్తాయి. అతను కన్నెర్రచేస్తే కొక్కిరాయి లీడర్లుకాలి పోతారు. అతను కంపెనీ పెడదామనుకుండేలోగానే చుట్టూ చేతులు చాపుతారు డబ్బు పట్టుకుని. ఊళ్ళో ఎవరు ముందుకు రావాలో, ఎవరు వెనక్కుపోవాలో నిశ్చయించేదతనే. కాని అదంతా రెండునెల్ల క్రిందవరకే. ఈ రెండు నెలల్లో....

"ఆ కుక్క వెధవ, సత్తిగాడు" అని కనకారావు తిట్టే సత్యనారాయణ ఎదురుతిరిగేడు. సత్యనారాయణ గుడ్డుదశలో వుండగా కనకారావు పొదిగి పిల్లని చేస్తే, వాడే ఇప్పుడు గండభేరుండమై పీక పట్టుకున్నాడు. సత్యనారాయణ తలా, నాలిక, కుడిభుజమే కాకుండా శకునిగా ఉండేవాడు. "ఇప్పుడేం లాభం? శనిగా తయారయ్యేడు. ఆ గాడిద రాజుగాడి పార్టీలో చేరి పోయాడు.

"నన్నొగ్గేశాడన్న ఇశారం లేదు. కాని ఆ ఎదవ గాడితో సెయ్యి కలిపేడంటేనే నాకు గుండె మండిపోద్ది. నువ్వు సిన్నోడివి సుదరిసినంబాబూ! నా నెపుతా నినుకో. నువ్వు మేజిస్ట్రేటుకోరటు వరండాల్లో యీది కుక్కలాకూకున్న రోజుల్లో నిన్ను పైకితీసింది నాను. నాను పోయేక అంతోడివి కావాలనుకునే వోణ్ని. ఏం నాభం? ఆ గుడ్డి సత్తిగాడు నీ కంచంలో కాలెట్టేడు. ఆడి పెళ్ళానికి జబ్బు చేస్తే ఏలకి ఏలు కరుసు సేసింది నాను. ఆ ఎదవ తమ్ముడికి ఎంబిబియస్సుకి దొనేసను కట్టిందినాను. ఆడి మిల్లుకీ, సినిమాహాలుకీ లైసెన్సులు తెచ్చింది నాను. ఆడి అప్ప మొగుణ్ని సంపించేస్తే కేసు కామాపు చేయించింది నాను.

కన్నుకొడుకుని సూసుకున్నట్లు సూసుకున్నాను. ఎట్నాబం! ఎనకదెబ్బ కొట్టేసేడు. ఆడు సైర్మె నవతానంటే నాను కాదంటనా? ఆ కుర్చీలో నానే కూకుండ బెట్టేవోణ్ని. కానా ఎదవ ఆడిగవురవం నిలబెట్టుకోనేదు; నన్ను నిలబెట్టు కోనీనేదు.

ఇపు డెంతేడిసి ఏట్నాబం? నేను మాటాణ్ను. అసల్నాకు మాట్లంటే అసయం. నాక్కావలసింది పని. నువ్వు తపస్సే సేస్తావో, తన్నులే తింటావో నాకు తెల్దు. కాన్నాకేసు నిలబెట్టు. ఆడికాడ మూడువేలూ పుచ్చుకున్నమాట్నిజం. ప్రొనోట్రాసిన మాట కూడా కాదన్ను. ఆడికేదో అవసరమొస్తే తిరిగిచ్చేసేను. వడ్డీ ఆడడగా నేదు. నా నివ్వానేదు. మాకూమాకూ వడ్డీలెప్పుడూ లేవు.

డబ్బిచ్చినప్పుడు నాను ప్రోనోటుకూడా అడగనేదు. అప్పుడాడే 'నా పెళ్ళాం గుళ్ళో కెళ్ళినాది. తాళాలు దాని కాడుండిపోయినాయి. అది రాగానే ప్రోనోటు అంపిచేస్తా'నన్నాడు. కాని ఆడు పంపించానేదు; నా నడగానేదు. అప్పటి కాడికా దురుద్దేశం ఉందనికూడా అనుకోను. నాను డబ్బిచ్చినప్పుడు ఆడూ, నేనూ, ఆడి కుక్కాతప్ప మరెవరూ నేరు. ఆడి కుక్కకి మాటొస్తే ఆడికంటే నిజం సాచ్చికంకోరట్లో జెప్తాది. సూడు సుదరిసినం బాబూ! నాను డబ్బిచ్చేసినమాట నీకు తెల్సు, నాకు తెల్సు. ఊరందరికీ తెల్సు. కాని కోరటువారికి తెల్దు.

కాబట్టి ఏటిసేస్తావో సెయ్యి. వందేకావాలో వెయ్యేకావాలో నన్నడుగు, నానిస్తాను. గాని ఆ ఎదవ తెచ్చిన ప్రోనోటు కేసు కొట్టించి. అది సేతగాపోతే ఆణ్ని సంపించీ, నీ పెళ్ళాం పిల్లల

భారం నాది" అంటూ లేచిపోయేడు కనకారావు. అతను వెళ్ళిపోయేక సుదర్శనం ఆలోచనలు రంగాచారిమీదికి వెళ్ళింది.

❖ ❖ ❖

రంగాచారి ఇద్ద రందమైన ఆడపిల్లలకి అందమైన తండ్రి. ఇద్దరు మంచి కొడుకులకి అతి మంచినాన్న. ఒక పతివ్రతకి పుణ్యమూర్తయిన భర్త. దేశానికి బాధ్యతగల పౌరుడు. ఆ ఊరుకి కోర్టు మునసబు. అతనెప్పుడూ సిగరెట్టు కాల్చలేదు. పరస్త్రీని ప్రేమించ లేదు. దొంగతనం చెయ్యలేదు. దొంగని వదిలెయ్య లేదు. అతనికి దేవునిపట్ల కృతజ్ఞతేగాని కావేషీలేదు.

దేవుడున్నాడా? ఉంటే అంతకంటె దుర్మార్గు దెవడైనా వున్నాడా? వగయిరా ప్రశ్న లతన్ని బాధించలేదు. దేవుడు మంచి వాడు. పూర్వజన్మనీ, పునర్జనీ శంకించినవాడికి పుట్టగతుల్లే కుండా పోతాయి. ఈ జన్మ పూజలపంటే వచ్చే జన్మ. మనుషులు మంచివాళ్ళూ చెడ్డవాళ్ళూ అని రెండే రెండు రకాలు. నిన్నటి కాటుగాడు నేటి ఖూనీకోరు. ఈవేళ బడికెళ్ళని పిల్లడు తర్వాత జైలుకెళ్ళక మానడు. మంచితనానికి మలేరియాలాగ డిగ్రీ లుండవు. చెడ్డతనానికి నిచ్చెన మెట్లుండవు. చెడ్డతనం అవి భాజ్యం. ఒక విషయంలో నీతి తప్పినవాడు మరో విషయంలో దారి తప్పడనేవింటి గ్యారంటీ? ఇవి, రంగాచారి నమ్మకాలు.

కేసు విచారణ పూర్తయింది. కనకారావు ఎంత బలవంతం చేసినా సుదర్శనం సత్యనారాయణని 'నీ అప్పని ఆరీవ్రాణీ అంటారా లేదా? అని అడగలేదు. కనకారావూ, సత్యనారాయణా ఇద్దరే సాక్షులు. బాకీ తేర్చేసేనని కనకారావు సాక్ష్యం. ఇవ్వలేదని సత్యనారాయణ ప్రమాణం. కాని తనకీ, కనకారావుకీ మధ్య మంచి నమ్మకం వుండేదనీ, కనకారావు యిదివరకు తన దగ్గర బదులు పుచ్చుకొని తీర్చేసిన ప్రోనోట్లు తనవద్దే వదిలేసేడనీ కనకారావుకి డబ్బు లక్ష్యం లేదనీ సత్యనారాయణ వొప్పుకున్నాడు.

కాని సుదర్శనానికి మాత్రం సంతోషం కలగలేదు. కనకా రావు తను భార్యతో కాపురం చేస్తున్నా, రంగమణిని చేరదీసేననీ, ఇద్దరివల్లా పిల్లలున్నారనీ వప్పేసుకున్నాడు.

"భార్య వుండగా పరస్త్రీని కన్నెత్తి చూడడం పాపం."

"చూసేక చెయ్యి వెయ్యడం పాతకం"

"కాలుజారి సంబంధం ఏర్పడితే భార్యను పుట్టింటికి పంపిం చెయ్యకపోవడం అమానుషం."

"పెళ్ళాం పీకలమీద ఉంపుడుకత్తె అనే కత్తిని శాశ్వతంగా కొయ్యకుండా పెట్టిన పెద్దమనిషి, ఎదుటి పార్టీలో కలిసిపోయిన తన ఎక్స్ అసిస్టెంట్ పీక ఎందుక్కోసెయ్యడు? ఈ ప్రశ్నలు మునసబుగారు వెయ్యరు ఆర్గ్యుమెంటులో కూడా, అవతలి వకీలు రామారావు వెయ్యడు. వేస్తేనే నయం. వెర్రో మొర్రో జవాబులు చెప్పుకోవచ్చు. వెయ్యని ప్రశ్నలు వేసిన ప్రశ్నలకంటే ప్రమాదకరం అని సుదర్శనం అనుకుం టుండగా, కేసు మర్నా టికి ఆర్గుమెంటుకి వాయిదా పడటం, రంగాచారి మేనత్త కొడుక్కి అర్జంటుగా ఆపరేషను అని టెలిగ్రాం రావడం చేత అతను విశాఖపట్నం వెళ్ళిపోవడం జరిగిపోయాయి.

ఆపరేషన్ సక్‌సెస్‌ఫుల్. పేషెంట్‌కూడా బతికేడు. మూడో నాటి మధ్యాహ్నం నిద్ర లేచేసరికి రంగాచారికి నరాలు ముడులు విడిపోయినట్టూ, యిన్నాళ్ళూ ఎముకలు దొలిచిన పురుగులు చచ్చిపోయినట్టూ, హాయిగా బద్ధకంగా, విలాసంగా మనస్సు స్నానం చేసినట్టుంది. హోటల్ గదిలో వాలుకుర్చీలో కూర్చు న్నాడు రంగాచారి. గదిలో ట్రాన్స్‌పరంటు ప్లాస్టిక్ కర్‌టెన్ వెనక బంగారు బల్బు పెట్టినట్టు సాయంత్రపు ఎండపడు తోంది.

సీలింగుఫ్యాను ప్రౌఢస్త్రీ కదలికలా ఆహ్లాదకరమైనంత మెల్లిగా తిరుగుతోంది.

ఈలోగా అడుగుల సవ్వడి.

కిటికిలో ఆశలకొసన పూసిన పువ్వులా ఒక స్త్రీ మొహం కనిపించి మాయమైంది.

తర్వాత ప్లాస్టిక్ కర్టెన్‌కింద గుండెని రేకెత్తించే ఎర్రరంగు పట్టుచీర క్రింద గులాబీరంగు ఆడపాదం. ఎర్ర వెల్వెట్ దిళ్ళమీ దుండవలసిన పాదం.

రంగాచారి హృదయంలో రోజాలు వికసించేయి.

పాదం కదలికకు లయవేసినట్టు గాజుల చప్పుడు.

రంగాచారి హృదయంలో సన్నగా వెయ్యి గిటార్లు ఒక్కసారి మ్రోగేయి.

పాదం మాయమైంది.

పక్కతలుపు తెరిచిన ధ్వనికి హృదయకవాటం ఓరగిలి వాలింది.

"నువ్వెళ్ళి వారం కూర్చుంటే నే నొక్కతెనూ యీ హోటల్లో వుండలే నన్నయ్యా"

పాదానికి ముప్ఫై ఏళ్ళుండొచ్చు. కాని మాటక ముచ్చటగా మూడే. ముద్దొస్తోంది.

'నువ్వెళ్ళొద్దు బాబూ,"

"మరేం పర్వాలేదు. ఈ వారం రోజులూ పక్కరూముల వాళ్ళు ఆ మాత్రం సాయం చేసి పెడతార్లే" ఒక మొగకంఠం ధైర్యం చెబుతోంది. తర్వాత ఆ కంఠం ఓనరు వెళ్ళిపోయిన పాదాల చప్పుడు.

❖ ❖ ❖

రాత్రి పది.

పక్కగదిలో పాదాల అలికిడి విని రంగాచారి చదువుతున్న పుస్తకం పక్కన పెట్టేశాడు.

పక్కగదిలో భళ్ళున కూజాపగిలిన ధ్వని.

"గుడ్ గాడ్! పాదాలు పగల్లేదు కదా!"

"లేదు" అన్నట్టు ఆస్త్రీ గదిలోకి వచ్చేసింది.

"కాసిని మంచినీళ్ళిస్తారూ?" బిస్మిల్లాఖాను ఆ గొంతు నుంచి చాలా నేర్చుకోవాలసి వుంది.

"అవశ్యం, కూర్చోండి."

ఆమె కూర్చుంది. రంగాచారిచ్చిన మంచినీళ్ళు జిన్‌లా రుచి చూసి గ్లాసు పక్కకిపెట్టేసి "పుస్తకాలేమైనా వున్నాయా?" అనడిగింది.

పుస్తకాలున్నాయి.

చెంద్రుడితో సయ్యాట లాడుతున్నట్టు, హొటేలు చెట్లల్లో దాగివున్న రంగు నక్షత్రాల్లా మిలమిల్లాడుతున్న డెకరేషన్ బల్బులూ వున్నాయి.

హోటలు కిటికీలోంచి ఆమె మొహాన్ని తొంగిచూసి అలంక రించుకున్న పెళ్ళికూతురు అనుకోకుండా అద్దంలో చూసుకున్న పుడు సిగ్గుపడ్డట్టు బిడియపడి, మబ్బుతెర కప్పుకొన్న చంద్రుడూ వున్నాడు.

నీలి సముద్రంమీంచి వచ్చిన చల్లగాలీ వుంది.

రంగాచారికి పరస్త్రీతో రాత్రిపూట ఒంటరిగా గదిలో వుండటం అది రెండోసారి. మొదటిసారి అతనితో వున్న ఆవిడ రిటైర్డు లేడీడాక్టరు. అప్పుడతనికి నూటరెండు జ్వరం కూడా.

నిజం చెప్పాలంటే యిప్పుడు నూటారు జ్వరం వచ్చినట్టుం దతనికి.

మంచినీళ్ళ కొచ్చినామె మర్నాడు ఉదయం కాఫీతాగి మరీ వెళ్ళింది ముచ్చటగా మూడ్రోజులు గడిచిపోయేయి.

❖ ❖ ❖

'కాని కనకారావు భార్య కన్యాయం చేశాడు' అని కనకారావు భార్యకంటె ఎమోషనల్‌గా ఆర్గ్యూచేశాడు అవతలి వకీలు రామారావు.

"చూడండి మిస్టర్ రామారావ్! ఈ దావా మూడు వేలూ తిరిగిచ్చేశాడా లేదా అన్నదొకటే ఇందులో పాయింట్" అన్నారు మునసబుగారు.

"తిరిగి యిచ్చేశా" దన్నారు ఆ తరువాత తీర్పులో.

(1968)

పారేసుకున్న బొమ్మ

రామారావుకి ఈ మధ్య తన జీవితం వెలిసిపోయిన చీరలా కని పించసాగింది. అతనికి అందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వున్నాయి. వీటితోపాటు జీవితం ఒక మధురమైన వెండికలలా గడిపెయ్యా లన్న కోరికగా వుంది. పెళ్లైన మూడు నాలుగు ఏళ్ళు జీవితం రంగుల కలలాగే గడిచి, చెరిగిపోయి పీడకలలా మారిపోయింది.

అతని పెళ్ళాం పతివ్రతా, అందగత్తెకూడా. అతని పిల్లలు ప్రాణం వచ్చిన కొవ్వుబొమ్మల్లా అతి అందంగా వుంటారు. అతనికి వొక కారూ, ఎనిమిది వందల జీతంగల ఉద్యోగం. పాతికెకరాల మాగాణీ వున్నాయి. "అతనికేం తక్కువ. అతని జీవితమే ఒక నిజమయిన బంగారుకల. కావాలంటే పగలూ, రాత్రికూడా పడుకొని కడుపునిండా కలలు కనమనండీ" అని ఎవరైనా అంటే వారికి కనకదుర్గ గురించి ఏమీ తెలీదన్నమాట!

కనకదుర్గకీ, కలలకీ మొదటి అక్షరమే సహనం. శంకరాచారి సమక్షంలో సారా తాగడం, చీపురుకట్టతో చిత్రాలు వెయ్యడం ఎంత సులువో, ఆమె సమక్షంలో ఆనందంగా వుండడం అంత సులువు. ఆమెకి పట్టుమని పాతికేళ్ళు రాకుండానే జీవితంలో అలసిపోయింది. ఆమె కొన్ని సంవత్సరాలై తనని తాను గృహిణి గానూ; తల్లిగానూ మాత్రం చూసుకోగలుగుతోంది. తను ఒక భార్యా అన్న హంశం పూర్తిగా మరిచిపోయింది.